# పుస్తక పరిచయం




**బలభద్రపాత్రుని రమణిగారిని** , తెలుగు పాఠకులకి, ముఖ్యంగా కౌముది పాఠకులకి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. గత 100 నెలలుగా క్రమం తప్పకుండా తమ ‘కాలమ్ దాటని కబుర్లు‘ ద్వారా కౌముది పాఠకులని అలరిస్తున్న రమణిగారు వ్రాసిన తాజా నవల ఇది. టి.వి.సీరియల్స్, సినిమా స్క్రిప్టులమధ్య నవలా రచనపై దృష్టిసారించని రమణిగారు 6 సంవత్సరాల తర్వాత వ్రాసిన సీరియల్ నవల ఇది. నవ్య వారపత్రికలో సీరియల్‌గా ప్రచురితమై , తర్వాత పుస్తకరూపంలో వచ్చింది. ఆధునిక యువతుల ఆలోచనాధోరణులకు, ప్రవర్తనా శైలులకు, జీవన విధానాలకు అద్దం పట్టిన నవల. ప్రధాన పాత్ర మందారమాల అనే యువతి. ఆ పాత్ర నేరేషన్‌లోనే కథ అంతా సాగుతుంది.

బొంబాయిలో ఉద్యోగం చేసే మందారమాల ఆఫీసుపని మీద అమెరికా వెళుతుంది. అక్కడ ఉన్న స్నేహితురాలు శాలిని వద్దకి వద్దకి వెళ్ళినప్పుడు సంజయ్ పరిచయమౌతాడు. ఎవరితోనైనా త్వరగా చనువు పెంచుకోగల సంజయ్ ముద్దుకి, కౌగిలింతకి పరవశించి పోతుంది మందారమాల. ఇండియా వచ్చేసినా అతని జ్ఞాపకాలే వెంటాడుతుంటాయి. ఐతే అతను శాలినితో కలిసి ఉంటున్నాడు కదా, అతనితో పెళ్ళి కుదురుతుందా అన్న సందేహం, అతన్ని వదులుకోలేని మానసిక స్థితి కొనసాగుతుంటుంది. సంజయ్ వాళ్ళ వూరికి వెళ్ళినపుడు అతనిలో మరోకోణం, అనాథ పిల్లలకి సేవ చేయడం, తెలుస్తుంది. అతని పట్ల ప్రేమ, ఆరాధనలతో బాటు గౌరవమూ పెరుగుతుంది. హఠాత్తుగా ఇండియా వచ్చిన సంజయ్‌తో అనుకోని పరిస్థితుల్లో శారీరకంగా కలుస్తుంది. ఇంక అతడే భర్త అని నిర్ణయించుకున్న మందారమాలను, శాలిని ఇండియా వచ్చినప్పుడు ‘సంజయ్‌ని ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకోమని నచ్చ జెప్పు‘ అని అభ్యర్థిస్తుంది. సంజయ్ ప్రతి విషయాన్ని తేలిగ్గా తీసుకుంటూ ఉంటాడు. మానసిక సంఘర్షణలో నలిగిపోయే మందారమాలకి చిత్ర విచిత్రమైన సంఘటనలు ఎదురౌతాయి. అమెరికాలో శాలిని ఘోరమైన పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు సంజయ్ ఆమెకి అన్నీ ఐ సహాయం చేస్తుంటాడు. అందరి జీవితాలూ అతలాకుతలం ఔతాయి. సంజయ్‌తో కలిగిన అనుభవం మందారమాలని వెంటాడుతూనే ఉంటుంది. కథ చిత్ర విచిత్రమైన మలుపులు తిరుగుతూ, చిట్టచివరి పేజీ వరకూ సస్పెన్స్ కొనసాగుతూనే ఉంటుంది. ఆధునిక యువతుల భావాలను ప్రతిబింబించడమే కాక ఈ నవలలో, యువతరం ప్రవర్తనల విశ్లేషణ ఉంది, సలహాలున్నాయి, పెద్దలకి పిల్లలకి మధ్య జరిగే సంఘర్షణలున్నాయి. అవసరమైన చోట్ల అద్భుతమైన భావుకత ఉంది. మనసుని సూటిగా తాకే వాక్యాలున్నాయి. నవల మొత్తంలో నేరేషన్‌ని, సంభాషణలని సమతుల్యతతో నడిపించి, 'నవలా రచన ఇలా ఉండాలి' అనేలా వ్రాశారు రచయిత్రి. సాంఘిక నవలల్లో సస్పెన్స్ కొనసాగించడం అంత తేలికకాదు. ఒక సంఘటన తర్వాత ‘ఇంక కథ ఇలా సాగుతుందేమో‘ అనుకునేంతలో పాఠకుల ఊహకందని మరో మలుపు వస్తుంది. సస్పెన్స్ విడిపోయినట్లే ఉంటుంది, మరో ఉత్కంఠ మొదలౌతుంది. పాత్రల మనస్తత్వ చిత్రీకరణ ఎంతో పరిణితితో సాగింది. మందారమాల పాత్ర పాఠకులని తనతో పాటు నడిపించుకుంటూ వెళుతుంది. ‘తప్పు చెయ్యడానికి అర్హత, ఏమీ తెలియని వయస్సు‘,‘ కొన్ని ముచ్చట్లు బావుంటాయి, కొన్ని ఆచారాలు ఇబ్బందిగా ఉంటాయి. మార్చుకోవాల్సినవి మార్చుకోరు, నేర్చుకోవాల్సినవి నేర్చుకోరు‘,‘ప్రేమ ఎంత నరకమో తెలియాలంటే, ప్రేమలో పడడం తప్ప గత్యంతరం లేదు‘ లాంటి వాక్యాలు నవల ముగించాక కూడా వెంటాడుతాయి. రమణిగారు తరచూ నవలలు వ్రాస్తుండాలని ఈతరం పాఠకులు మరీమరీ కోరుతున్నారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.!

★★★




**ఆధునిక** తెలుగు కవితారంగంలో తనదైన సొంతసంతకాన్ని నిలుపుకున్న, నిలుపుకుంటున్న కవి శ్రీ విన్నకోట రవిశంకర్. ఇప్పుడు వస్తున్న వచనకవితల్లో ప్రామాణికమని చెప్పగలిగిన కవితలు ఏవి - అంటే ఖచ్చితంగా అందులో రవిశంకర్‌గారి కవితలకి ఉన్నతస్థానం లభిస్తుంది. సాధారణంగా ఏ కవి ఐనా ఇతరుల కవిత్వం గురించి విశ్లేషణ వ్రాశాడు అంటే - ఆ ఇతర కవి చరిత్రలో ప్రసిద్ధి చెందిన వాడే ఐ ఉంటాడు. సమకాలీన కవుల కవిత్వాన్ని విశ్లేషించే కవులు అరుదుగా కనిపిస్తూ ఉంటారు. ఈ పుస్తకంలో రవిశంకర్‌గారు చేసిన మంచిపని అదే తాను కవి ఐ ఉండీ, సమకాలీన కవిత్వాన్ని తన స్వీయరచన అంత అందంగానూ విశ్లేషించారిందులో. ‘మంచి కవితతో కొంచెం సేపు‘ అనే శీర్షికలో కౌముది ప్రారంభ సంవత్సరంలో రవిశంకర్‌గారి వ్యాసాలు ధారావాహికంగా వచ్చాయి. 275 పేజీల ఈ పుస్తకంలో దాదాపు 100 పేజీల వరకూ కౌముదిలో రవిశంకర్‌గారు వ్రాసిన విశ్లేషణలు ఉన్నాయి. ఇంకా ‘ఈ మాట‘ పత్రికలో వారు అధికసంఖ్యలో వ్రాసిన వ్యాసాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. కేవలం ఇతర ఈ తరం కవుల కవితా విశ్లేషణలే కాక - ‘తెనుగుతోట పరిచయం‘,‘ నాన్నగారి అలవాట్లు - కొన్ని జ్ఞాపకాలు ‘,‘ ఇస్మాయిల్ గారితో నా పరిచయం‘ లాంటి అరుదైన వ్యాసాలు కూడా ఉన్నాయి. ‘సినిమా పాటల్లో కొన్ని రచనా విశేషాలు ‘ అన్న వ్యాసం అత్యంత ఆసక్తికరంగా ఉంది. ‘శ్రీశ్రీ కవిత్వంలో కొన్నిసామాన్య జీవనాంశాలు‘ వ్యాసంలో శ్రీశ్రీ కవితలో ఎవరూ చూడని కోణాల్ని చూపించారు. కేవలం కవిత్వం గురించే కాక అంపశయ్య నవీన్‌గారి రచనల గురించి ‘నవీన్ నవలల్లో కొన్ని ప్రత్యేకతలు‘,‘ నవీన్ పాటించిన కొన్ని విలువలు‘ అనే విశ్లేషణలూ ఉన్నాయి. "రవిశంకర్‌గారు ఏది వ్రాసినా , ఆయన వచన కవితల్లానే, ఆసాంతం చదివించేలా ఉండడమే కాక హృదయాన్ని తాకుతూ, కొత్త ఆలోచనలని రేకెత్తిస్తూ ఉంటాయి" అనడానికి ఇందులోని ప్రతివ్యాసమూ ఒక ఉదాహరణే. కవిత్వం వ్రాయడం కానీ, అర్థం చేసుకుని అభిమానించడం కానీ ఓట్లు వేసి గెలిపించాల్సిన ప్రక్రియ కాదనీ, ఆ రెండూ కూడా కవికీ, పాఠకుడికీ మధ్య జరిగే ప్రత్యేకమైన సంభాషణ అనీ విస్పష్టంగా చెప్పారు రవిశంకర్‌గారు. అదే కోణంలో సాగిన ఈ పుస్తకంలోని విశ్లేషణలన్ని ఆయా కవుల కవిత్వానికి ఈ పుస్తకం చదివే పాఠకులకి మధ్య చక్కటి వారధిని నిర్మిస్తాయి. దాచుకుని మరీ, తరచూ చదవాల్సిన పుస్తకం ఈ ‘కవిత్వంలో నేను‘. ★★★

**Published by:**
*VANGURI FOUNDATION OF AMERICA*
*PO BOX: 1948, Stafford , TX 77497*
*Phone: 832 594 9054*
*vangurifoundation@gmail.com*

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**